
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 28.7, కనిష్ఠం 18.3

నిజామాబాద్
జిల్లా వార్తలు

శుక్రవారం 1 మార్చి 2024



బలమైన నేతను బరిలోకి దించేందుకు కాంగ్రెస్ నేతల సన్నాహాలు

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, దిల్‌రాజు సోదరుడివైపు మొగ్గు

గట్టి ప్రయత్నాలు చేస్తున్న అరికెల, ఆకుల లలిత

ప్రచారం కొనసాగిస్తున్న బీజేపీ నేతలు

బలమైన నేత కోసం బీఆర్ఎస్ యత్నాలు

పార్లమెంట్ ఎన్నికలకు

కాంగ్రెస్ కసరత్తు



నిజామాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల కోసం కాంగ్రెస్ కసరత్తు కొనసాగిస్తోంది. బలమైన సామాజిక వర్గం నేతలను బరిలోకి దించేందుకు సన్నద్ధమవుతోంది. జిల్లా నుంచి పార్లమెంట్ పోటీకి చాలా మంది నేతలే పోటీ పడుతున్నా ఇద్దరు నేతలపై ఎక్కువగా దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మిగతా నేతల అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తూనే వీరి వైపు మొగ్గుచూపుతున్నట్లు తెలిసింది. బీజేపీ, బీఆర్ఎస్ ఇంకా అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఆచితూచి నిర్ణయం తీసుకునేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. బీజేపీ నుంచి సిట్టింగ్ ఎంపీకే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నా ఇంకా ప్రకటించలేదు. బీఆర్ఎస్ నుంచి ఇంకా చర్చలు మాత్రమే కొనసాగుతుండగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ మాత్రం సీటును దక్కించుకునేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తోంది. ప్రజల మద్దతు, ఆరు గ్యారంటీల అమలు చేయడంతో తమకు కలిసివస్తుందని భావించడంతో పాటు బలమైన అభ్యర్థిని దించే విధంగా ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం.

మెజార్టీ సీట్లపై నేతల ప్రయత్నాలు

వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మెజార్టీ సీట్లను సాధించేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. అదే రీతిలో నిజామాబాద్ పార్లమెంట్ స్థానాన్ని సాధించేందుకు పూర్తిస్థాయిలో నజర్ పెట్టినట్లు తెలిసింది. ఈ పార్లమెంట్ స్థానం నిజామాబాద్‌లో ఐదు నియోజకవర్గాలు ఉండగా జగిత్యాల జిల్లాలో రెండు నియోజకవర్గాలు ఉన్నాయి. పూర్తి వ్యవసాయక పార్లమెంట్ నియోజకవర్గమైన దీనిలో రైతులు, గల్ఫ్ కార్మికులు, బీడీ కార్మికులు, యువత నిర్ణయానికి అనుగుణంగానే గెలుపు ఓటములు ఆధారపడి ఉన్నాయి. వీటన్నింటిని సమీక్షిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థులపై ఫోకస్ చేసినట్లు తెలిసింది. పార్లమెంట్ పోటీకి జిల్లా నుంచి చాలా మంది దరఖాస్తులు చేసిన చేయనివారి పేర్లను కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. పార్లమెంట్‌లో పోటీ కోసం పలువురు ప్రయత్నాలు చేస్తున్న ప్రధానంగా ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి వైపే ఎక్కువగా మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఐదు నియోజకవర్గాలు ఉండటం వల్ల సినీ రంగంలో ఉన్న దిల్‌రాజ్ సోదరుడు నర్సింహారెడ్డిని రంగంలోకి దించుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్ అధిష్ఠానం నేతలు కూడా వారితో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. దిల్‌రాజుతో మంతనాలు జరపగా తనకు బదులు తన సోదరుడిని బరిలోకి దించనున్నట్లు వారికి వివరించినట్లు తెలుస్తుంది. సామాజిక సేవలో ఉన్న ఆయన పూర్తిస్థాయిలో రాజకీయాలకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి, దిల్‌రాజు సోదరుడి మధ్యనే ఎక్కువగా అధిష్ఠానం మొగ్గు ఉన్నట్లు తెలిసింది. వీరితో పాటు మాజీ ఎమ్మెల్సీలు అరికెల నర్సారెడ్డి, ఆకుల లలితలు కూడా ఎక్కువగా ప్రయత్నాలు చేస్తున్నారు. వీరు అధిష్ఠానాన్ని కలిసి అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. గతంలో జిల్లాలో తమకున్న పరిచయాలను వివరిస్తున్నారు. వీరితో పాటు ఆరెంజ్ ట్రావెల్స్ అధినేత సునీల్‌రెడ్డి కూడా ప్రయత్నాలను చేస్తున్నారు. ప్రజలతో ఉన్న సంబంధాల ఆధారంగా తనకు అవకాశాలు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రధానంగా మాత్రం ఇద్దరివైపే మొగ్గు చూపడం వల్ల వారిలో ఒకరికి అవకాశం రానున్నట్లు తెలుస్తోంది. సర్వే ఏజెన్సీల ద్వారా ప్రజల నాడిని తెలుసుకునే ప్రయత్నాలు పార్టీ నేతలు చేస్తున్నారు. వీరితో పాటు ఇతర ఏజెన్సీల ద్వారా కూడా వివరాలను తీసుకుంటున్నట్లు తెలిసింది. ఎలాగైనా సీటు సాధించడంతో పాటు జిల్లాలో పేరున్న నేతలనే అభ్యర్థిగా దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

నియోజకవర్గంలో పర్యటిస్తున్న బీజేపీ నేతలు

కాంగ్రెస్ పూర్తిస్థాయిలో కసరత్తు చేస్తుండగా బీజేపీ పార్టీ నేతలు ఇప్పటికే నియోజకవర్గం మొత్తం పర్యటించారు. విజయసంకల్ప యాత్ర పేరిట నాలుగు రోజుల పాటు పర్యటించారు. పార్టీకి చెందిన సీనియర్ నేతలతో పాటు కేంద్ర మంత్రి గడ్కరీ కూడా హాజరయ్యారు. సిట్టింగ్ ఎంపీకే సీటు దాదాపు ఖరారు కావడంతో అర్వింద్ పూర్తిస్థాయిలో ప్రచారం కొనసాగిస్తున్నారు. ఒకటి రెండు రోజుల్లో ఆయన అభ్యర్థిత్వాన్ని కూడా ప్రకటించనుండటంతో పూర్తిస్థాయిలో ప్రచారం కోసం ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మండలాల వారిగా పర్యటించేందుకు సిద్ధమవుతున్నారు.

బీసీ నేతపై బీఆర్ఎస్ చూపు

పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ నేతలు కూడా కసరత్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ రెండు పార్టీలకు దీటుగా బలమైన నేతలను దించేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన బీసీ నేతను బరిలోకి దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గం పరిధిలోని ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించి పూర్తిస్థాయిలో నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గతంలో లాగానే మళ్లీ సీటును సాధించుకునేందుకు పార్టీ నేతలు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. మూడు పార్టీల నేతలు కూడా ఈ దఫా పార్లమెంట్ సీటును ప్రాధాన్యతగా తీసుకొని ఈ ప్రయత్నాలను చేస్తున్నారు.



ఫ్యాక్టరీలోని మిషనరీని పరిశీలిస్తున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సారంగపూర్ చక్కెర ఫ్యాక్టరీ పరిశీలన

- చెరుకు సంఘం నాయకులతో ఎమ్మెల్యే ధన్‌పాల్ చర్చ

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: రూరల్ మండలం సారంగపూర్‌లోని సహకార చక్కెర కర్మాగారాన్ని గురువారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తలు సందర్శించారు. కిసాన్ సంఘ్ నేతలు, చెరుకు సంఘం నాయకులు కొండల్ సాయిరెడ్డి, నర్సారెడ్డి, శంకర్‌రెడ్డి తదితరులతో మాట్లాడారు. ఫ్యాక్టరీ గత వైభవం, మూసివేతకు దారితీసిన పరిస్థితులు వివరించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో ఫ్యాక్టరీ తిరిగి తెరుచుకుందని, రైతులు, సిబ్బంది బకాయిలు సైతం చెల్లించారని తెలిపారు. 2008 తర్వాత నుంచి ఫ్యాక్టరీ మూసివేతకు గురయిందని తెలిపారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఎన్నోసార్లు ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు వినతులు సమర్పించామన్నారు. ఫ్యాక్టరీలోని విలువైన మిషనరీ తుప్పపట్టిపోయిందని, పరికరాలు సైతం పనికిరాకుండా పోతున్నాయన్నారు. ఫ్యాక్టరీకి సంబంధించిన విలువైన భూములను అప్పటి బీఆర్ఎస్ నేతలు విక్రయించేందుకు యత్నించగా చెరుకు రైతులు అడ్డుకున్న విషయం తెలిపారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నందున, తెలంగాణలోని ఏకైక సహకార చక్కెర కర్మాగారాన్ని తిరిగి తెరిపిస్తే వేల మంది చెరుకు రైతులు, వందల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కలుగుతుందని వివరించారు. ఈ అంశం ఎంపీ ధర్మపురి అర్వింద్, ఇతర పెద్దల దృష్టికి తీసుకువచ్చి ఫ్యాక్టరీ పునరుద్ధరణకు కృషి చేస్తానని ధన్‌పాల్ సూర్యనారాయణ హామీ ఇచ్చారు.

ఇంటర్ ద్వితీయ సంవత్సర పరీక్షలు ప్రారంభం

- పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. 57 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు సెకెండ్ లాంగ్వేజ్ పేపర్-2 పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 16వేల 961 మంది విద్యార్థులకు గాను 16వేల 238 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 723 మంది గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా ఎలాంటి మాస్ కాపీయింగ్ కేసు నమోదు కాలేదు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ నగరంలోని నిర్మల హృదయ, సీఎస్ఐ జూనియర్ కళాశాల సెంటర్లను పరిశీలించారు. డీఐఈవో రఘురాజ్ మాక్లూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, దాస్‌నగర్ మహాత్మ జ్యోతిబా ఫూలే జూనియర్ కళాశాల, ఉమెన్స్ కళాశాలలను తనిఖీ చేశారు. హైపవర్ కమిటీ, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు 10 పరీక్షా కేంద్రాలను, ఫ్లయింగ్ సిట్టింగ్ స్క్వాడ్ బృందాలు 28 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు.



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

మెగా డీఎస్సీ ప్రకటనతో నిరుద్యోగుల్లో హర్షం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: ఏన్నో ఏళ్లుగా నిరుద్యోగ యువత ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం ఎదురు చూస్తుండగా ప్రభుత్వం త్వరలో మెగా డీఎస్సీ నిర్వహించనున్నట్లు ప్రకటన చేయడంతో నిరుద్యోగ యువతలో హర్షం వ్యక్తమవుతుంది. ఈ నెల 4 నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. గతంలో దరఖాస్తులు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవసరం లేదని పాత దరఖాస్తులే పరిగణలోకి తీసుకోనున్నట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 11వేల 62 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 46 ఏళ్ల మధ్య వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. గత ఏడాది 5వేల 89 పోస్టులకు గాను గత ప్రభుత్వం డీఎస్సీ ప్రకటన ఇవ్వగా ఆ నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ కొత్తగా 11వేల 62 పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో 6508 ఎస్జీటీ పోస్టులు, 2629 స్కూల్ అసిస్టెంట్ పోస్టులు, 727 లాంగ్వేజ్ పండిత్ పోస్టులు, 182 పీఈటీలు, ప్రత్యేక కేటగిరిలో స్కూల్ అసిస్టెంట్‌లు 220, ఎస్జీజీ పోస్టులు 796 భర్తీ చేయనున్నారు.

- జిల్లాలో 601 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలు

జిల్లాలో 601 పోస్టుల ఖాళీలు...

జిల్లాలో 601 ఉపాధ్యాయ పోస్టుల ఖాళీలను భర్తీ చేయనున్నారు. జిల్లాలో 124 స్కూల్ అసిస్టెంట్, 23 లాంగ్వేజ్ పండిత్, 9 పీఈటీ, 403 సెకండరీ గ్రేడ్ టీచర్, 11 స్కూల్ అసిస్టెంట్లు (స్పెషల్ కేటగిరి), 31 ఎస్జీటీలు (స్పెషల్ కేటగిరి) పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో లాంగ్వేజ్ పండిత్ హిందీ 7, లాంగ్వేజ్ పండిత్ తెలుగు 10, లాంగ్వేజ్ పండిత్ ఉర్దూ 6, ఎస్ఏ బయో సైన్స్ తెలుగు మీడియం 20, ఎస్ఏ బయోసైన్స్ ఉర్దూ మీడియం 3, ఎస్ఏ ఇంగ్లీష్ 7, ఎస్ఏ హిందీ 9, ఎస్ఏ గణితం తెలుగుమీడియం 16, ఎస్ఏ గణితం ఉర్దూమీడియం 2, ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ తెలుగు మీడియం 3, ఎస్ఏ ఫిజికల్ సైన్స్ తెలుగుమీడియం 5, ఎస్ఏ సోషల్ తెలుగుమీడియం 37, ఎస్ఏ సోషల్ ఉర్దూమీడియం 8, ఎస్ఏ తెలుగు 11, ఎస్ఏ ఉర్దూ 3, ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ తెలుగుమీడియం 10, ఎస్ఏ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉర్దూమీడియం 1, ఎస్జీటీ ఇంగ్లీష్ మీడియం 5, ఎస్జీటీ హిందీ మీడియం 2, ఎస్జీటీ తెలుగుమీడియం 285, ఎస్జీటీ ఉర్దూ మీడియం 111, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ తెలుగు మీడియం 28, ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ ఉర్దూ మీడియం 3 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు ఖాళీల జాబితాను రూపొందించారు.



ఎగుమతులను ప్రోత్సహించడం వల్లే

పసుపునకు అధిక ధర

- కాంగ్రెస్ పాలనలో ఏనాడూ రైతులను పట్టించుకోలేదు
- రైతుల ఆర్థిక బలోపేతమే లక్ష్యంగా బీజేపీ ప్రభుత్వం పనిచేస్తుంది
- విజయసంకల్ప యాత్ర ముగింపు సభలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

నిజామాబాద్, ఫిబ్రవరి 29 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కేంద్రం పసుపు ఎగుమతులను ప్రోత్సహించడం వల్లే ధర పెరుగుతోందని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. గురువారం నగరంలో నిర్వహించిన బీజేపీ విజయసంకల్ప యాత్ర ముగింపు సభలో ఆయన పాల్గొన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులను పట్టించుకోలేదన్నారు. పంటలకు సరైన ధర వచ్చే విధంగా చూడటం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వ హయాంలో రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూస్తున్నామన్నారు. పసుపు రైతుల కోసమే ఎగుమతులను ప్రోత్సహిస్తున్నామన్నారు. చక్కెర ఫ్యాక్టరీలకు ఆదరణ ఇవ్వడం వల్ల లాభాలతో కొనసాగుతున్నాయన్నారు. చక్కెర ఉత్పత్తితో పాటు మొలాసిస్, ఇథనాల్ ఉత్పత్తుల వల్ల రైతులకు లాభాలు వస్తున్నాయన్నారు. ఇథనాల్‌ను పెట్రోల్‌లో కలపడం వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. కాంగ్రెస్ వల్ల ఏనాడు రైతులకు మేలు జరగలేదన్నారు. ఆ పార్టీని నమ్ముకుంటే లాభం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి మళ్లీ పట్టం కట్టాలని పిలుపునిచ్చారు.

మంత్రి గడ్కరీ నిబద్ధతతో పనిచేస్తారు: ఎంపీ అర్వింద్

కేంద్ర మంత్రి గడ్కరీ నిబద్ధతతో పనిచేస్తారని ఎంపీ అర్వింద్ అన్నారు. ఆయన కార్యాలయానికి ఎప్పుడు వెళ్లినా.. రెండు నిమిషాల్లోనే పూర్తి చేస్తారన్నారు. ఏ ఫైల్ కూడా ఆగదన్నారు. ఆయన సారథ్యంలోనే దేశ వ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్ హైవేల నిర్మాణం కొనసాగుతుందన్నారు. ఉత్తర దక్షిణ భారతాలను కలుపుతూ రోడ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంటేనే ఇవన్నీ సాధ్యమవుతాయని ఆయన అన్నారు.

ఓడిన వారికే అవకాశం ఇస్తున్నారు: ఎమ్మెల్యే ధన్‌పాల్

శాసనసభ ఎన్నికల్లో ఓడిపోయిన వారికే సీఎం రేవంత్ రెడ్డి నిధులు ఖర్చు చేసేందుకు అవకాశం ఇస్తున్నారని ఇదెక్కడి ప్రజాస్వామ్యమని ఎమ్మెల్యే ధన్‌పాల్ ప్రశ్నించారు. నిధులన్నీ కొడంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాలకే తీసుకువెళ్తున్నారన్నారు. నిజామాబాద్ నగర కార్పొరేషన్‌లో డివిజన్‌కు కోటి రూపాయల చొప్పున నిధులు మంజూరు చేసినా వాటిని మాత్రం ఇవ్వడం లేదన్నారు. నియోజకవర్గానికి ఇచ్చే 10 కోట్ల రూపాయలను కూడా ఓడిపోయిన వారికి ఇస్తే ఎమ్మెల్యేలు ఎలా పనిచేస్తారని ఆయన ప్రశ్నించారు.

కాంగ్రెస్‌తో అభివృద్ధి జరగదు : ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

దేశంలో చాలా ఏళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉన్నా అభివృద్ధి జరగలేదన్నారు. వారు ఏనాడు ప్రజల సమస్యలను పట్టించుకోలేదని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి అన్నారు. మూడోసారి బీజేపీని గెలిపిస్తే దేశం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ విజయసంకల్ప యాత్ర ముగింపు సభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్‌కులాచారి, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణరావు, రాష్ట్ర కార్యదర్శులు పల్లె గంగారెడ్డి, ప్రదీప్‌కుమార్, జిల్లా ఇన్‌చార్జి వెంకటరమణి పాల్గొన్నారు.

క్యాడర్‌లో జోష్

జిల్లాలో మూడు రోజుల పాటు విజయసంకల్ప యాత్ర ఐదు నియోజకవర్గాల పరిధిలో నిర్వహించగా క్యాడర్‌లో జోష్ పెరిగింది. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ ముందే కొమరం భీమ్ క్లస్టర్‌లో మూడు పార్లమెంట్ పరిధిలో ఈ యాత్రను చేపట్టారు. బాసరలో మొదలైన ఈ యాత్ర నిజామాబాద్‌లో ముగిసింది. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల మద్దతును కూడగట్టేందుకు ఈ యాత్ర ఉపయోగపడినట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు.



- పసుపు ఉడకబెడుతున్న మహారాష్ట్ర కూలీలు

డొంకేశ్వర్‌లో మహారాష్ట్ర కూలీలు

- పసుపు ఉడికించే పనులతో ఉపాధి
- మూడు నెలల పాటు గుడాల్లో నివాసం
- కొన్నేళ్లుగా డొంకేశ్వర్‌కు కూలీల వలస
- పసుపు ఉడికించే సమయంలో యంత్రాల వద్ద అధిక వేడి
- ముందుకురాని స్థానిక కూలీలు
- మహారాష్ట్రలో కూలి దొరకక మండలానికి వలస వస్తున్న కూలీలు

డొంకేశ్వర్, ఫిబ్రవరి 29: మండలంలో మహారాష్ట్ర కూలీలు ఉపాధి పొందుతున్నారు. మూడు నెలలపాటు గుడాల్లో నివాసం ఉంటూ పనులు చేపడుతున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సాగు చేసిన పసుపు పంట తవ్వకాలను చేపడుతున్నారు. తవ్విన పసుపును ఉడికించి ఎండబెడతారు. అనంతరం స్వచ్ఛమైన కొమ్ములను మార్కెట్‌కు తీసుకువెళ్లి రైతులు అమ్ముతారు. అయితే పసుపును యంత్రం ద్వారా ఉడికించే సమయంలో అగ్ని వేడి ఎక్కువగా వస్తుంది. దీంతో పసుపు ఉడికించేందుకు స్థానిక కూలీలు ఎవరూ ముందుకు రావడంలేదు. మరో వైపు మహారాష్ట్రలో పని దొరకపోవడంతో కొంత మంది కూలీలను ఉపాధి కోసం డొంకేశ్వర మండలానికి వలసవస్తున్నారు.

150 మంది కూలీల రాక

ప్రతీ సంవత్సరం జనవరి నుంచి మార్చి వరకు పసుపు ఉడకబెడతారు. ఉడకబెట్టేందుకు మహారాష్ట్ర నుంచి కూలీలు వస్తారు. ఇక్కడనే గుడారాలు ఏర్పాటు చేసుకుని పిల్లాపాపలతో నివసించి పనులకు వెళ్తారు. ఈ సీజన్‌లో పసుపు ఉడికించేందుకు డొంకేశ్వర్‌కు వచ్చి రెండు నుంచి మూడు నెలల పాటు ఉపాధి పొందుతామని కూలీలు పేర్కొన్నారు. ప్రస్తుతం మండలంలోని డొంకేశ్వర్, నూత్‌పల్లి, నడ్కుడ, గాదేపల్లి గ్రామాల్లో 150మంది కూలీలు కుటుంబాలతో వచ్చి ఇక్కడే పని చేసుకుంటున్నారు.

డబ్బాకు రూ.90

మహారాష్ట్ర నుంచి వచ్చిన కూలీలకు స్థానికంగా ఉండే రైతులు పసుపు ఉడికించేందుకు యంత్రాన్ని సమకూర్చుతారు. ఇందుకు తోట రైతు యంత్రం యజమానికి ఒక డబ్బా ఉడికించేందుకు రూ.140 చెల్లిస్తారు. ఇందులోనే ఒక్క డబ్బా పసుపు ఉడికించేందుకు గాను కూలీలకు రూ.90 చెల్లిస్తున్నారు. పసుపు ఎత్తుకొని కట్టెలతో మంట చేయడం ఉడికించిన పసుపును రైతు చూపించిన స్థలంలో పోయడం వంటి అన్ని పనులు వాళ్లే చేసుకుంటారు. ఇలా రోజు ఉదయం 6నుంచి రాత్రి 8గంటల వరకు రోజు దాదాపు 50నుంచి 60డబ్బాల వరకు పసుపు ఉడికిస్తామని కూలీలు పేర్కొంటున్నారు.

రోజుకు రూ.1080

మహారాష్ట్ర కూలీలు పది మంది గ్రూప్‌గా ఏర్పడి ఆయా గ్రామాల్లో పసుపు ఉడికించే పనులు చేపడుతున్నారు. నిత్యం ఒక్క బృందం 50డబ్బాల వరకు ఉడకబెట్టడంతో సుమారు రూ.30వేల వరకు ఆదాయం వస్తుంది. దీంతో తమకు ఒక్క రోజు రూ.1080 గిట్టుబాటు కూలీ అవుతుందని తెలిపారు. మహారాష్ట్రలో ఉపాధి లేకపోవడం వల్ల ప్రతి సంవత్సరం పసుపును ఉడకబెట్టి సమయంలో నాలుగు సంవత్సరాల నుంచి ఇక్కడికి వచ్చి పనులను చేపడుతున్నామని కూలీలు అంటున్నారు.

కుటుంబ పోషణ కోసం వచ్చాం..

: దాదారావు, కూలీ, (మహారాష్ట్ర)



మాది మహారాష్ట్రలోని కాపర్‌కేడు గ్రామం నుంచి ఇక్కడి వచ్చాం. అక్కడ సరైన ఉపాధి దొరకక కుటుంబపోషణ కోసం భార్య పిల్లతో కలిసి డొంకేశ్వర్‌కు వచ్చాం. ఇక్కడ పసుపు ఉడకబెట్టేందుకు పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. మాకు చేతినిండా పని దొరుకుతుంది.

కూలి కొంత పెంచాలి..

: సంతోష్, కూలీ, (మహారాష్ట్ర)



మహారాష్ట్రలో మేమున్న ప్రాంతంలో పనులు లేకపోవడంతో ఇక్కడికి వచ్చాం. ప్రస్తుతం పసుపును ఉడకబెడుతున్నందుకు ఒక డబ్బాకు రూ.90 ఇస్తున్నారు. రైతులు మా కష్టం చూసి డబ్బాకు ఇంకొంచెం ఇస్తే బాగుంటుంది. ఇక్కడికి రావడం వల్ల మాకు చేతినిండా పని దొరకుతుంది కుటుంబపోషణ భారం కాకుండా ఉంటుంది.

- గుడారాలు వేసుకున్న మహారాష్ట్ర కూలీలు



'రుణాలను సకాలంలో చెల్లించాలి'

మోపాల్, ఫిబ్రవరి 29: మహిళా సంఘాలు బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని మండల సమైక్య ఏపీఎం మోహన్ మహిళా సంఘాలకు సూచించారు. గురువారం మోపాల్ మండల సమైక్య సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలు బ్యాంకు నుంచి తీసుకున్న 37.55 కోట్ల రూపాయలు తీసుకుంటే ఇప్పటి వరకు 35కోట్లు రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. మరో 2.55 కోట్లు మార్చి చివరిలోగా అనుకున్న లక్ష్యాన్ని సాధించుకునే విధంగా సంఘాలు కృషి చేయాలని కోరారు. బ్యాంకులోను తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. మార్చి చివరిలోగా వంద శాతం రికవరీ అయ్యే విధంగా సంఘ సభ్యులందరూ భాగస్వాములు కావాలని కోరారు. సమావేశంలో 29 సంఘాల ప్రతినిధులు, పాలకవర్గం సభ్యులు, సీసీలు, ఎంఎస్ సీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీవేంకటేశ్వరస్వామి రథోత్సవం

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని అర్గుల్ గ్రామంలో గురువారం శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి జాతర, రథోత్సవం ఘనంగా నిర్వహించారు. మొదట యజ్ఞం నిర్వహించి బలిప్రధానం చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రథోత్సవం అంగరంగా వైభవంగా నిర్వహించారు. భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై రథోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతేకాకుండా వేదపండితులు ఆశ్చర్యతేజ చక్రవర్తుల ఆధ్వర్యంలో స్వామివారి జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ గోర్త పద్మ, మాజీఉపసర్పంచ్ గోర్త రాజేందర్, ఎంపీటీసీ అనిత, వీడీసీ చైర్మన్ రాజారెడ్డి, కోశాధికారి మురళి, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన నుడా డైరెక్టర్

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: రూరల్ మండలం కాలూరుకు చెందిన బీఆర్‌ఎస్ నేతలు బీజేపీ పార్టీలో చేరారు. గురువారం సారంగపూర్‌లోని చక్కెర కర్మాగారం వద్ద జరిగిన కార్యక్రమంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ సమక్షంలో నుడా డైరెక్టర్ ముష్క సంతోష్ నేతృత్వంలో 30 మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాషాయజెండా కప్పుకున్నారు. వీరిని ధన్‌పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కులాచారి దినేష్‌లు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నుడా డైరెక్టర్, కాలూరు వాసి ముష్క సంతోష్ తెలంగాణ మలిదశ ఉద్యమం తొలి రోజుల నుంచి పార్టీకోసం పనిచేశారు. బీఆర్‌ఎస్ సీనియర్ నేత, రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌కు ముష్క సంతోష్ అత్యంత సన్నిహితుడు కావడం విశేషం. ముష్క సంతోష్ తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పల్లెగంగారెడ్డి, పద్మారెడ్డి, ఒంటెల శంకర్ రెడ్డి, దాసరి అరుణ్‌కుమార్, తిర్మన్‌పల్లి దిలావర్ తదితరులు పాల్గొన్నారు.



బీఆర్‌ఎస్ నేతలకు పార్టీ కండువా కప్పుతున్న ధన్‌పాల్



బాల్కొండలో నువ్వు పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి

'నువ్వు పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి'

ముప్కాల్, ఫిబ్రవరి 29: బాల్కొండ మండల కేంద్రంలో నువ్వు పంటకు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని గురువారం మండల వ్యవసాయాధికారి మహేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. నువ్వు పంటకు ఆకుముడుత, గొంగళి పురుగు, పత్రహరితాన్ని గీకి తినడం వల్ల ఎగుదుదల ఆగిపోతుందని దిగుబడి తగ్గిపోతుందని అన్నారు. ఇమామెక్టిన్, బెంజాయేట్ 100గ్రాములు, క్లోరాంతర నిలిప్రోలు 60ఎంఎల్ ఎకరానికి ఒకదానికి 200లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని ఆయన సూచించారు. రసం పీల్చే పురుగులైన తామర నల్లిపేను ఆకులో అడుగుభాగం నుంచి రసం పీల్చడం వల్ల ఆకులు పాలిపోయి ఎదుగుదల లోపిస్తుందని, నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 100ఎంఎల్, డైమిథయేట్ 400ఎంఎల్, దయోమిథాక్సమ్ 80గ్రాములు ఒక దానిని 200లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని వివరించారు.

అర్గుల్‌లో 'లగ్గం' షూటింగ్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని అర్గుల్ గ్రామంలో గురువారం లగ్గం సినిమా షూటింగ్ చిత్రీకరించారు. గ్రామంలోని మైనారిటీ గుట్టపై సినిమా సెట్టింగ్ వేసి హీరోయిన్‌పై కొన్ని సన్నివేశాలను, పాటలను చిత్రీకరించారు. అనంతరం రైతు బోర్ర నర్సారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో హీరోయిని చిన్నారులతో కూడిన పాటను చిత్రీకరించారు. సాయంత్రం గ్రామంలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయం జాతరలో లగ్గం సినిమా షూటింగ్ తీశారు. ఈ సినిమా షూటింగ్ తీస్తున్నారని తెలుసుకున్న అర్గుల్ గ్రామస్థులతో పాటు చుట్టు పక్కల గ్రామాల తరలివచ్చి తిలకించారు.



హీరోపై సన్నివేశాన్ని చిత్రీకరిస్తున్న దృశ్యం

చక్కెర ఫ్యాక్టరీలను తెరిపించాలి

ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు డిమాండ్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29: నిజామాబాద్ జిల్లాలో గల చక్కెల ఫ్యాక్టరీలను ప్రభుత్వం తెరిపించాలని ఎన్సీఎస్ఎఫ్ సారంగాపూర్ చక్కెర ఫ్యాక్టరీని తెరిపించి రైతులను ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు వేల్పూరి భూమయ్య డిమాండ్ చేశారు. గురువారం డిచ్‌పల్లిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే చక్కెర ఫ్యాక్టరీని తెరిపిస్తామని ఇచ్చిన హామీ మేరకు నిజాంషుగర్ ఫ్యాక్టరీని పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు నాయకత్వంలో సబ్ కమిటీ వేశారని ఎన్‌సీఎస్ఎఫ్ ఫ్యాక్టరీ దానిలో లేకపోవడాన్ని తాము విభేదిస్తునమన్నారు. ఎన్‌సీఎస్ఎఫ్‌తో పాటు సారంగాపూర్ కూడా ఈప్రాంత రైతులు తెలంగాణలో ఉన్నారని ఈ ఫ్యాక్టరీని కూడా సబ్ కమిటీలో చేర్చాలన్నారు. అధికారంలోకి వస్తే 100రోజుల్లో ఫ్యాక్టరీని తెరిపిస్తామని చెప్పి బీఆర్ఎస్ మోసం చేసిందన్నారు. అందుకే రైతులకు ఆపార్టీకి ఎన్నికల్లో బుద్ధి చెప్పారన్నారు. జిల్లాలోని చక్కెర ఫ్యాక్టరీలను ప్రభుత్వం తెరిపించి నడిపించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు సాయిరెడ్డి, దేవ స్వామి, సాయినాథ్ పాల్గొన్నారు.

సారంగాపూర్‌లో రెజ్లర్ నేహాబేగంకు సన్మానం

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: రూరల్ మండలం రాంనగర్‌కు చెందిన రెజ్లర్ నేహాబేగం జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచిపేరు తేవాలని బీఆర్ఎస్ నేతలు ఆకాంక్షించారు. గురువారం సారంగపూర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రెజ్లర్ నేహాబేగంను మైనార్టీ అధ్యక్షుడు అక్బర్‌నవాజుద్దీన్ ఘనంగా సన్మానించాడు. రాంనగర్‌కు చెందిన నేహాబేగం ఆర్మూర్ మైనార్టీ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. చదువుతో పాటు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో రెజ్లర్‌గా బహుమతులు పొందింది. కడు పేదరికంలో పుట్టిన నేహాబేగం చదువులో ముందుండి, రెజ్లింగ్‌లో కూడా శిక్షణ పొందింది. వరంగల్‌లో జరిగిన తెలంగాణ స్టేట్ లెవెల్ అండర్ 15 రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొని గోల్డుమెడల్ పొంది జాతీయ స్థాయి పోటీలకు అర్హత పొందింది. పంజాబ్‌లో త్వరలో జరగబోయే జాతీయ స్థాయి పోటీలకు సిద్ధమవుతున్నట్లు తెలిపింది. పేదరికంలో ఉన్న నేహాబేగం కుటుంబాన్ని తనతోపాటు తన మిత్రబృందం ఆర్థిక సహాయం చేస్తున్నట్లు అక్బర్‌నవాజుద్దీన్ తెలిపారు. ఈకార్యక్రమంలో అఫ్సర్ ఖాన్, నర్సాగౌడ్, రాజు, వాహిద్‌అలీ, అంజు, బి.అశోక్ తదితరులున్నారు.

ఘనంగా మండేలేశ్వర స్వామి విగ్రహప్రతిష్ఠాపన



మండేలేశ్వర స్వామి విగ్రహప్రతిష్ఠలో పాల్గొన్న రజక సంఘ సభ్యులు

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 29: రజకుల ఆరాధ్యదైవం మండేలేశ్వర స్వామి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన రజన సంఘ సభ్యుడు గ్రామ శివారులోని కుడిగుంట సమీపంలో ఇటీవలే నూతనంగా మండేలేశ్వర స్వామి నూతన ఆలయాన్ని నిర్మించుకున్నారు. కాగా గత మూడు రోజులుగా విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉత్సవమూర్తులను మేళతాళాలు డప్పువాయిద్యాలు బోనాలు, మంగళహారతుల మధ్య ఊరేగింపుగా నూతన ఆలయానికి చేర్చారు. కాగా గురువారం గ్రామ అర్చకులు కప్పగంటి రమేష్ చంద్ర శాస్త్రి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్చానల మధ్య ప్రత్యేక పూ.లఅనంతరం విగ్రహ ప్రతిష్ఠాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్నసత్రం నిర్వహించగా మండలంలోని రజక సంఘాల సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారికి కట్నకానుకలు సమర్పించుకున్నారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు ఆవుట్ల బాజన్న, కోశాధికారి సుంకెట నర్సయ్య, సుంకెట గంగాధర్, బాజన్న, సుంకెట శ్రీనివాస్, రవి, దశరత్, సుంకెట రమేష్, సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

ధర్పల్లి, ఫిబ్రవరి 29: మండలంలోని రేకులపల్లి గ్రామానికి చెందిన ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి గురువారం తెలిపారు. రేకులపల్లి వాగు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు గ్రామానికి వెళ్లి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఇసుక అక్రమ రవాణాపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని ఆయన తెలిపారు.

శవ పేటిక అందజేత

రుద్రూరు, ఫిబ్రవరి 29: రుద్రూరు మండలంలోని బొప్పాపూర్ గ్రామంలో గురువారం లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూరు శ్యామ్‌సుందర్ పహాడే సహకారంతో గ్రామ కమిటీ వారికి శవ పేటికను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సావిత్రి లింగం బాపూజీ, లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూరు కోశాధికారి లయన్ కె.వి. మోహన్ , ఎర్రోళ్ల సురేందర్, సంతోష్, గ్రామ ప్రత్యేక అధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష అట్టల పంపిణీ

కోటగిరి,ఫిబ్రవరి29: కోటగిరి ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం పదో తరగతి విద్యార్థులకు అభయహస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు పంపిణీ చేశారు. గ్రామ మాజీ సర్పంచ్ బర్ల గంగారాం సహకారంతో ఆయన తనయుడు బర్ల మధు విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రావు, నాయకులు బర్ల రవి, కూచి శ్రీనివాస్, సత్యనారాయణ, సాయిలు, సలీం తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ ప్రధానకాల్వలో శవమైంది

నిజాంసాగర్, ఫిబ్రవరి 29 : బుధవారం అదృశ్యమైన గురువారం శవమై తేలింది. ఎల్లారెడ్డి మండలం గండి మాసానిపేట్‌కు చెందిన శిరీష (38) అనే మహిళ బుధవారం ఇంటి నుంచి బయలు దేరి నిజాంసాగర్ మండలం గాలిపూర్ వద్ద 3సంవత్సరాల కుమారున్ని వదిలికాల్వలో దూకింది. కుటుంబ సభ్యులు వివాహిత మహిళ అదృశ్యమైనట్లు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు శిరీష కుమారున్ని రోడ్డుపై ఎందుకు వదిలింది, వదిలినీటిలో దూకిందా అని విచారణ జరిపారు. మృతదేహం నిజాంసాగర్ ప్రధానకాల్వలోని డిస్ట్రిబ్యూటర్ 9(ఎ) మధ్య మృతదేహం ఉండటంతో పశువుల కాపర్లు పోలీసులకు సమాచారం అందజేశారు. నిజాంసాగర్ ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భర్త సతీష్ శవాన్ని శిరీషదే అని గుర్తించారు. ప్రధానకాల్వలో దూకి ఆత్మహత్య చేసుకోవడం పట్ల భర్త పై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని ఎస్సై సుధాకర్ తెలిపారు. శిరీష అదృశ్యమైన కేసు ఆత్మహత్యగా పరిగణలోకి తీసుకోవడమే కాకుండా భర్తను విచారిస్తున్నట్లు తెలిపారు.

క్యారమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా సంతోష్‌కుమార్

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29:తెలంగాణ క్యారమ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా క్యాతం సంతోష్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో నిర్వహించిన తెలంగాణ క్యారమ్స్ అసోసియేషన్ ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఉన్న సంతోష్‌కుమార్ రాష్ట్ర అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా జిల్లా అసోసియేషన్ అధ్యక్షునిగా కొనసాగారు. నూతనంగా ఎన్నికైన సంతోష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షునిగా తనపై ఉంచిన నమ్మకాన్ని సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. జిల్లాలో తెలంగాణలో క్యారమ్ క్రీడాకారుల అభివృద్ధికి తోడ్పడుతానని అన్నారు. క్యారమ్ రాష్ట్ర అధ్యక్షునిగా ఎన్నికైన సంతోష్‌ను ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఈగ సంజీవ్‌రెడ్డి, బొబ్బిలి నర్సయ్య, వివిధ క్రీడా సంఘాల నాయకులు లింగయ్య, సాయాగౌడ్, సుబ్బారావు, విద్యాసాగర్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, గోపిరెడ్డి, అబ్బత్, మీసాల ప్రశాంత్‌లు హర్షం వ్యక్తం చేశారు.

మండుతున్న ఎండలు..ఎండుతున్న గొంతులు

● బట్టితండా, బానవత్ తండా, కిషన్‌తండాల్లో తాగడానికి నీళ్లు దొరకని పరిస్థితి ● వ్యవసాయ బావులనుంచి తెచ్చుకుంటున్న మహిళలు ● పట్టించుకోని అధికారులు



వ్యవసాయ పొలం వద్ద నీల్లు పట్టుకుంటున్న గిరిజనులు

సిరికొండ ఫిబ్రవరి 29: రోజు రోజుకు ఎండలు ఒకవైపు మండుతున్నాయి, మరోక వైపు తాగడానికి నీళ్లందక గొంతులు ఎండుతున్నాయని గిరిజనుల ఆందోళన చెందుతున్నారు. సిరికొండ మండలంలోని పాకాల గ్రామ పంచాయతీ పరిధిలోని బట్టితండా, బానవత్ తండా, కిషన్‌తండాల్లో తాగడానికి నీళ్లు దొరక్క మహిళలు వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నారు. తండా ముందే మిషన్ భగీరథ ట్యాంకున్న అందులోకి నీళ్లు రాక తండా ప్రజలకు నీళ్లందడం లేదంటున్నారు. ముందున్న తండాలకు నీళ్లు రావు కాని మరోక తండాకు మాత్రం భగీరథ నీళ్లు వస్తున్నాయని గిరిజనులు చెపుతున్నారు. ఎండలు తీవ్రమవుతున్న నేపద్యంలో గొంతు తడుపుందామంటే నీళ్లు లభించడం లేదంటున్నారు. ప్రభుత్వాలు ఆడబిడ్డలు ఇబ్బంది పడొద్దని ఇంటింటికి కుళాయి నీళ్లు అందిస్తున్నామని చెపుతున్న ఆచరణలో మాత్రం అందరికి భగీరథ నీళ్లు రావడం లేదని గిరిజనుల ఆవేదన బట్టి తెలుస్తోంది. ఎల్లవారు లేచింది మొదలు తాగు నీటి కోసం వ్యవసాయ బావుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. కొన్ని సందర్భాల్లో గొంతు తడుపుకుందామంటే కూడ నీళ్లు లభించని దుస్థితి నెలకొన్నదన్నారు.కొత్త ప్రభుత్వమైన తమ తండాల ప్రజలకు నీళ్లు అందించడానికి చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.తాగునీటి సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసికెళ్లిన వారు మాత్రం చేసేదేమిలేదని చేతులెత్తేస్తున్నారని గిరిజన యువకులు,మహిళలు చెపుతున్నారు. తమ దగ్గర నిధులు లేవని నీటి సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని మండల అధికారులు చెపుతున్నారని తండాకు చెందిన యువకులు చెబుతున్నారు. ఉన్నాతాధికారులు స్పందించి తమకు తాగునీటిని అందించాలని తండాకు చెందిన మహిళలు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి రాహుల్, ప్రత్యేక అధికారి గంగారాంను ప్రశ్నించగా తాగు నీటి సమస్య ఉన్నమాట వాస్తమేనని అన్నారు.తండాల ప్రజలతో నీటి విషయమై చర్చించడం జరిగిందని పక్కా తండా వారిని నీటిని ఇచ్చే విధంగా ఒప్పించడం జరిగిందన్నారు. ఎంపీడీవోకు తాగునీటి సమస్య గురించి వివరించామని త్వరలోనే సమస్య పరిష్కారం అవుతోందని పంచాయతీ కార్యదర్శి రాహుల్ చెప్పారు.



బట్టి తండాలో వాటర్ ట్యాంక్

జలాల్‌పూర్‌లో మోటార్లు నడువడం లేదు

జలాల్‌పూర్‌లో మోటార్లు నడువడం లేదని అందువల్ల తండాకు మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ శివ చెప్పారు.. పాకాలలో ఒకటి రెండు తండాల్లోనే తాగునీటి సమస్య ఉన్నట్లు తమ దృష్టికి ఆయన వచ్చిందన్నారు. ఒకటి రెండు రోజుల్లో సమస్య తీరిపోతుందన్నారు.

- మిషన్ భగీరథ గ్రిడ్ ఏఈ శివ

నేత్రానందం.. అనంత పద్మనాభుడి కల్యాణం

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 29: భక్తుల అనంత పద్మనాభ స్వామి నామస్మరణలు, మేళతళాల మధ్య అనంత పద్మనాభస్వామి కళ్యాణోత్సవం నేత్రానందంగా సాగింది. అమ్మవారిని, స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఎదురెదురుగా కూర్చోబెట్టి వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల మధ్య అర్చకులు కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మల్కాపూర్ (ఎ) గ్రామంలోని అనంత పద్మనాభస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా 3వ రోజైన గురువారం కళ్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. అర్చకులు మాకునూరి రమణాచార్య కళ్యాణంలోని ముఖ్య ఘట్టాలైన పాదప్రక్షాళన, మధుపర్కం, జలకరబెల్లం, కణ్యాధానం, మాంగళ్యసూత్రధారణ, మలాపరివర్తన,తలంబ్రాలు, బ్రహ్మముడిలను భక్తులకు చూపిస్తూ ఆద్యాంతం భక్తిపారవశ్యంతో జరిపారు. భక్తులు కళ్యాణవేడుకలను చూస్తూ అనంతపద్మనాభస్వామి గోవిందా గోవిందా అంటూ తనయత్వంలో మునిగిపోయారు.



స్వామివారికి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

అనంతరం నిర్వహించిన మహా అన్నప్రసాదంలో పెద్ద సంఖ్యలో భక్తులు అన్నప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మల్కాపూర్ (ఎ) గ్రామపెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు.

డీఎస్సీ నోటిఫికేషన్‌ను స్వాగతిస్తున్నాం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: కొత్త ప్రభుత్వం రాష్ట్రంలో 11వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు ఇచ్చిన డీఎస్సీ నోటిఫికేషన్ ను స్వాగతిస్తున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెనిగళ్ల సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా ఉపాధ్యాయ నియామకాలను వేగంగా చేపట్టాలని తద్వారా ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయ ని పేద మధ్యతరగతి విద్యార్థులకు ప్రయోజనం జరుగుతాయన్నారు. ఆలస్యమైనప్పటికీ ప్రభుత్వం ఎన్నో ఏళ్లుగా బీఈడీ, డీఈడీలను పూర్తి చేసి ఉద్యోగ ప్రకటనల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగులకు శుభవార్త చెప్పిందన్నారు.ఈవేసవిలో బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే విడుదల చేయాలని, నిలిచిపోయిన పదోన్నతులు, బదిలీలను వెంటనే పూర్తి చేయాలన్నారు. జీవో నంబర్ 317తో ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులను ప్రభుత్వం సొంత జిల్లాలకు బదిలీ చేయాలని వారు కోరారు.

వ్యవసాయ డిగ్రీ కళాశాల మంజూరు అభినందనీయం

రుద్రూరు, ఫిబ్రవరి 29: రుద్రూరుకు నూతన వ్యవసాయ డిగ్రీ కళాశాల మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తంచేస్తూ గురువారం రుద్రూరు మండలంలోని ప్రాంతీయ చెరకు మరియు వరి పరిశోధన కేంద్రం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్ర పటాలకు క్షీరాభిషేకం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తోట అరుణ్‌కుమార్, మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, పార్టీ ఉపాధ్యక్షులు నడిపింటి నగేష్, తీగుళ్ల గంగామణి వరప్రసాద్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయాలి

రెంజల్,ఫిబ్రవరి29: మార్చి 3వ తారీఖు నుంచి 5వ తారీఖు వరకు నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రెంజల్ మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వినయ్ కుమార్ అన్నారు. గురువారం ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్ పోలియో కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షహీత ఫిర్దోస్, డాక్టర్ ప్రమోదిత, ఉజ్మ, ఆరోగ్య విస్తరణ అధికారులు ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి29: పట్టణంలోని సికన్వెన్షన్ హాల్‌లో డివిజన్ స్థాయి ఆరోగ్య సిబ్బందికి గురువారం జిల్లా ఇమ్యూనేషన్ అధికారిణి డాక్టర్ అశోక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో రమేష్ ఎయిడ్స్ వ్యాధి పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆరోగ్య సేవలు అన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, వివిధ రకాల వ్యాధుల పట్ల సిబ్బందికి శిక్షణను అందించారు. అలాగే ఎయిడ్స్ వ్యాధి ఒక అంటు వ్యాధి అని దీని పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌స్థాయి ఆరోగ్య శాఖ సిబ్బంది, సూపర్‌వైజర్‌లు, డాటా ఎంటీ ఆపరేటర్‌లు, తదితరులు పాల్గొన్నారు.

నేడు డొంకేశ్వర్ పీఏసీఎస్ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాసం

డొంకేశ్వర్, ఫిబ్రవరి29: డొంకేశ్వర్ మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వైస్‌చైర్మన్ రాజారెడ్డిపై శుక్రవారం అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టనున్నారు. ఇటీవల సొసైటీ డైరెక్టర్‌లు వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం కోరుతూ డీసీవోకు వినతిపత్రం అందజేశారు. ఏడుగురు డైరెక్టర్‌లు సంతకాలు చేసినట్టు తెలిసింది. అధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం సొసైటీ వైస్‌చైర్మన్‌పై అవిశ్వాస పరీక్ష జరగనుంది.

షాపుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి

ఇందల్వాయి, ఫిబ్రవరి 29: ఫర్టిలైజర్ షాపుల వివరాలను ఖచ్చితంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని ఏవో ప్రవీణ్‌కుమార్ ఇందల్వాయి మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపుల యజమానులకు గురువారం అవగాహన కల్పించారు. షాపులో ఎప్పటి నుంచి ప్రారంభమయ్యాయి, ఏఏ మందులను విక్రయిస్తున్నారో వాటి వివరాలను ప్రతీది ఆన్‌లైన్‌లో నమోదు చేసి తక్షణమే ప్రతీ ఒక్కరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు, పురుగు మందులను విక్రయించాలని అన్నారు. అధిక ధరలకు అమ్మొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో యజమానులు నర్సయ్య, కల్యాణ్, రవి, తదితరులు ఉన్నారు.

నిజామాబాద్‌లో పసువు ధర రూ.15.25

ఖిల్లా, ఫిబ్రవరి 29: నిజామాబాద్ మార్కెట్‌లో పసుపునకు రోజురోజుకు ధర పెరుగుతుంది. మార్కెట్‌కు గురువారం పసుపు తీసుకువచ్చిన బద్దం సంతోష్ అనే రైతు పసుపుకు క్వింటాలు 15వేల 25 రూపాయలు ధర పలికింది. ఈ మార్కెట్‌కు గురువారం మొత్తం 7,500 క్వింటాలు పసుపు అమ్మకానికి వచ్చింది. సరాసరి ధర క్వింటాలుకు 14వేల 611 రూపాయలు ధర పలికింది. సంతోష్ క్వింటాల్‌న్నర పసుపు తీసుకురాగా ఆయన ఒక్కడికి మాత్రమే ఈ ధర వచ్చింది. మిగతా రైతుల పసుపు క్వింటాలుకు 8వేల నుంచి 11వేల 500 మధ్యనే ఎక్కువగా అమ్మకాలు జరిగింది. కొద్దిమంది రైతులకు మాత్రం 14వేల 611 రూపాయల వరకు ధర వచ్చింది. మార్కెట్‌లో సరాసరి మోడల్ రేటు ప్రకారం ధర వస్తుందని కార్యదర్శి వెంకటేశం తెలిపారు. ఒక్క రైతుకు మాత్రమే ఈ ధర పెట్టారని ఆయన తెలిపారు.

రుణాలను సకాలంలో చెల్లించాలి

మోపాల్, ఫిబ్రవరి 29: మహిళా సంఘాలు బ్యాంకులో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని మండల సమైక్య ఏపీఎం మోహన్ మహిళా సంఘాలకు సూచించారు. గురువారం మోపాల్ మండల సమైక్య సమావేశం మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘాలు బ్యాంకు నుంచి తీసుకున్న 37.55 కోట్ల రూపాయలు తీసుకుంటే ఇప్పటి వరకు 35కోట్లు రికవరీ చేయడం జరిగిందని తెలిపారు. మరో 2.55 కోట్లు మార్చి చివరిలోగా అనుకున్న లక్ష్యాన్ని సాధించుకునే విధంగా సంఘాలు కృషి చేయాలని కోరారు. బ్యాంకులోను తీసుకున్న మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. మహిళా సంఘాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని తెలిపారు. మార్చి చివరిలోగా వంద శాతం రికవరీ అయ్యే విధంగా సంఘ సభ్యులందరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. సమావేశంలో 29 సంఘాల ప్రతినిధులు, పాలక వర్గం సభ్యులు, సీసీలు, ఎంఎస్ సీసీలు, తదితరులు పాల్గొన్నారు.



మండల సమైక్య సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

భార్య గొంతు నులిమి హత్య చేసిన భర్త

● ఆత్మహత్యగా చిత్రీకరణ ● భర్త, అత్తమామ, ఆడపడుచు జైలు శిక్ష

ముప్కాల్, ఫిబ్రవరి29: కట్టుకున్న భర్తే కాలయముడై భార్య గొంతు నులిమి హత్య చేసి ఆపై ఆత్మహత్యగా చిత్రీకరించి చివరికి కటకటాల్లోకి వెళ్లిన ఘటన బాల్కొండలో వెలుగు చూసింది. బాల్కొండ మండల కేంద్రంలో బుధవారం అత్తింటి వేధింపులకు బలైన దర్మాయి లావణ్య మృతిపై. గురువారం బాల్కొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ శ్రీధర్ ఎస్సై గోపితో కలిసి వివరాలు వెల్లడించారు. 15ఏళ్ళ క్రితం దర్మాయి రాజేందర్ లావణ్యకు వివాహం జరిగింది. అప్పటి వరకు సాఫీగా జరిగిన వారి కాపురం ఏడాది తర్వాత గొడవలు ప్రారంభమయ్యాయయి. దీంతో అత్తింటి వారు లావణ్యపై కేసులు పెట్టారు. ఈ క్రమంలో కేసు మాఫీ చేసేందుకు రాజేందర్ మృతురాలి తండ్రి వద్ద నుంచి రూ.2లక్షలు సైతం తీసుకున్నారు. కోర్టు కేసుల విషయంలో గొడవలు తారాస్థాయికి చేరాయి. తరచు భర్త రాజేందర్ అత్త గంగు, మామ లింగన్న, ఆడపడుచు వేదిని వేదిస్తున్నారు. ఈనెల 28న లావణ్య రాజేందర్ మధ్య జరిగిన గొడవలో చనిపోవాలని లావణ్యను రాజేందర్ కోరాడు. దీంతో సూసైడ్ నోట్ రాసిన కొన్ని గంటల్లో ఎవరు లేని సమయంలో లావణ్య గొంతుకు టవల్తో బిగించి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు చిత్రీకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు రాజేందర్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీకరించినట్టు పేర్కొన్నారు. లావణ్యను మానసికంగా శారీరకంగా చిత్రహింసకు గురి చేసిన భర్త, అత్తమామ, ఆడపడుచులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీధర్, ఎస్సై గోపి

కేంద్రం కార్మిక చట్టాలను కాలరాస్తోంది

● ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్



బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న కార్మికులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం బీడీ వర్కర్స్ యూనియన్ కార్మికుల పొట్ట కొట్టేలా కార్మికుల చట్టాలను కాలరాస్తున్నరని ప్రగతి శీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జేపీ గంగాధర్ డిమాండ్ అన్నారు. గురువారం తెలంగాణ ప్రగతి శీల వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. కార్మిక చట్టాలను హరించి వేస్తున్నరని కార్మికుల హక్కులను కాలరాస్తున్నరని సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ ప్రభుత్వం చెప్పి విస్మరించిందన్నారు. కార్మికుల చట్టాలను సవరించలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయకార్యదర్శి సుప్రియ, లక్ష్మీ, పద్మ, గంగామణి, రాజమని, స్వప్న, పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివి : సీడీపీవో

రెంజల్,ఫిబ్రవరి29: విధి నిర్వహణలో అంగన్‌వాడీల సేవలు వెల కట్టలేనివని సీడీపీవో జానకి అన్నారు. విధి నిర్వహణ పట్ల అంకిత భావం ప్రదర్శించినపుడే సరైన గుర్తింపు లభిస్తుందని అన్నారు. గురువారం మండల కేంద్రంలో సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సీడీపీవో జానకి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలా రాణిలు పిల్లల హైట్, వెయిట్ తీయడం జరిగింది. ఫిబ్రవరి 1నుండి 29వరకు పోషణ ట్రాకర్‌పై సర్వే యాప్ చేయడంపై అవగాహన కల్పించారు. పోషణ ట్రాకర్‌లో వందశాతం పేర్లు రిజిష్టర్ చేసిన వారికి సెలక్షన్ చేసి అంగన్‌వాడీ కార్యకర్తతో పాటు ఆయాలకు అవార్డులు ప్రధానం చేశారు. నెల రోజులుగా పోషణ ట్రాకర్‌లో వందశాతం పూర్తి చేసిన వారిని గుర్తించి వారికి శాలువ, పూలమాలతో సత్కరించి బహుమతి ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వినయ్ కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రావణ్ కుమార్, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వన సంపద పెంచినప్పుడే అందరికి ఆదర్శం

మోర్తాడ్, ఫిబ్రవరి29: వన సంపద పెరిగినప్పుడు అందరికి సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు. గురువారం మోర్తాడ్ బాలికల పాఠశాలలో మూడు మండలాలకు చెందిన విద్యార్థులకు జాతీయ సైన్స్ దినోత్సవాల్లో భాగంగా ఉపన్యాస పోటీలు, జికె పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రయ్య మాట్లాడుతూ ప్రతీఒక్కరు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. అటవీ సంపద తగ్గుతున్న తరుణంలో దాని ప్రభావం మన జీవితాలపై పడుతుందని అందరికి ఆరోగ్య కలగాలంటే అడవులు పెంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వినోద్; శ్రీనివాసమూర్తి, మడు మండలాల సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

రెంజల్,ఫిబ్రవరి29: వేసవికాలం దృష్ట్యా గ్రామాలలో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీవో శంకర్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో పాటు ఫీల్డ్ అసిస్టెంట్‌లకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందశాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని, గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత కార్యదర్శులదేనని, గ్రామాలలో ఏర్పాటు చేసిన నర్సరీలలో గ్రీన్ నెట్‌లు ఏర్పాటు చేసి నర్సరీలో మొక్కలను సంరక్షించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్‌లదేనని అన్నారు. నర్సరీల సంరక్షణతో పాటు మొక్కలను కాపాడాల్సిన బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లదేనని సూచించారు. ఈకార్యక్రమంలో సూపరిండెంట్ శ్రీనివాస్, ఎంపీవో గౌసొద్దీన్, ఏపీవో రమణ, ఈసీ,పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యత కేంద్ర ప్రారంభం

మెండోర, ఫిబ్రవరి29: మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సీఎఫ్ఎల్‌ను గురువారం స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా మేనేజర్ క్రాంతికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ ప్రతీఒక్కరు ఆర్థిక అవగాహన కలిగి ఉండలని సోషల్ సెక్రిట్ స్కీములలో పీఎం ఎస్బీవై పీఎంజేజేబీవై ఏపివైలో చేరాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాక్లూర్ సీఎఫ్ఎల్ కౌన్సిలర్ రవి, మెండోర సీఎఫ్ఎల్ కౌన్సిలర్ శ్రీనివాస్, ప్రసాద్, అరవింద్, ఎస్‌బీఐ సీఎస్పీ సంధ్యరాణి, తదితరులు పాల్గొన్నారు.

మోర్తాడ్ పాఠశాలలో విద్యార్థుల స్వయం పాలన

మోర్తాడ్, ఫిబ్రవరి29: మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై విద్యార్థులకు బోధించారు. విద్యార్థులు ప్రధానోపాధ్యాయుడు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు బాలరాజు, ఉపాధ్యాయులు సంధ్యారాణి, శ్రావణి, సారిక, సీఆర్‌పీ సాయిరాం, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ కాలువలో పడి వ్యక్తి మృతి

కోటగిరి,ఫిబ్రవరి29: రుద్రూర్ మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామానికి చెందిన హంగర్ల వీరన్న(65)అనే వ్యక్తి నిజాంసాగర్ కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు. ఈ నెల 25వ తేదీన వీరన్న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. 26వ తేదీన నిజాంసాగర్ కాలువ పక్కన బట్టలు విడిచి నీటిలో దిగాడు. పారుతున్న నీటి ఉధృతికి వీరన్న కొట్టుకుపోయాడు. గురువారం వీరన్న మృతదేహం కోటగిరి గ్రామ శివారులోని నిజాంసాగర్ కాలువలో లభ్యమైందని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ ఢీకొని మహిళ మృతి

నవీపేట,ఫిబ్రవరి29: నిజామాబాద్ మండలం పాల్దాకు చెందిన మరియా(60)అనే మహిళ బైక్ ఢీకొనడంతో మృతి చెందిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. బుధవారం రాత్రి ఇంటి నుంచి దుకాణంలో పాల ప్యాకెట్ కొనడానికి వెళ్తుండగా నిజామాబాద్ నుంచి జన్నేపల్లికి వెళ్తున్న బైక్ వెనుక నుంచి ఢీకొనడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయని వెంటనే 108లో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. మృతురాలి మేనల్లుడు ప్రేమ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడా పరికరాల పంపిణీ



విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29: తెలంగాణ రాష్ట్ర ఆర్ అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్ తన ఉదారతన చాటుకున్నారు.తాను చదువుకున్న జడ్పీహెచ్‌ఎస్ డిచ్‌పల్లి పాఠశాల విద్యార్థులకు రూ.1లక్ష క్రీడపరికరాలు పంపిణీ చేశారు. 300స్కూల్ బ్యాగులు, 250 జామ్రెటీ బాక్స్‌లు, హాకీస్టిక్స్, వాలీ బాల్స్, ఫుట్‌బాల్స్ పరికరాలు, 100ప్లేటు గ్లాస్‌లు, పరీక్ష ప్యాడు లు, మైకు సౌండ్ బాక్స్‌లు ఉచితంగా అందజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి హాజరై ఆయన చేతుల మీదుగా వి ద్యార్థులకు పంపిణీ చేశారు. తను చదువుకున్న పాఠశాల విద్యార్థులకు మోహన్ నాయక్ ఉచితంగా పంపిణీ చేయడంపై ఎమ్మెల్యే అభినందిం చారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ



సైకిళ్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29: రోటరీక్లబ్ ఆఫ్ జెమ్స్ నిజామాబాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లను పంపిణీ చేశారు. నగరంలోని వినాయక్ నగర్‌లోగల అభ్యాస స్కూల్‌లో సైకిళ్లను మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ రాజేందర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ జెమ్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. విద్యార్థిని విద్యార్థులు చదువుపై దృష్టిపెట్టి తల్లిదండ్రుల ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. అనంతరం రోటరీక్లబ్ ఆఫ్ జెమ్స్ అధ్యక్షులు భూలోకం విజయ్‌కాంత్‌రావు మాట్లాడుతూ సైకిళ్లను అందజేసిన రోటరీక్లబ్ ఆఫ్ హైదరాబాద్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు భూలోకం విజయ్‌కాంత్‌రావు, కార్యదర్శి బంగారు వీరబ్రహ్మం, కోశాధికారి అనంత కులకర్ణి, ప్రాజెక్టు చైర్మన్ రాజశేఖర్, సభ్యులు సూర్యప్రకాశ్, రంజిత్ ఠాకూర్,పద్మశ్రీనివాస్, గౌరీశంకర్, సృజన్ రెడ్డి, వేములవాడ దేవిదాస్ ఉన్నారు.

2వ రోజు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతం



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి 29: బోధన్‌లో 2వరోజు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రాలను ఇంటర్మీడియట్ బోర్డు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ అధికారి రవికుమార్ ఆకస్మికంగా సందర్శిం చారు. ఇంటర్మీడియట్ పరీక్షలలో ఎలాంటి మాస్ కాపీయింగ్ జరుగకుండా చూడాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోని వసతులను, సీసీ కెమెరాలను పరిశీలిం చారు. మధుమలాంచ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని సందర్శించి కళాశాల రికార్డులను పరిశీలించారు. ఈకార్యక్రమంలో పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ తదితరులు ఉన్నారు.

నవీపేట: మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. నవీపేట, రెంజల్ మోడల్ కళాశాలలు, మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, కస్తూర్బా కళాశాల, నవోదయ జూనియర్ కళాశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పరీక్షకు గాను 440మంది విద్యార్థులకు 432మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని అధికారులు పేర్కొన్నారు.

అంకాపూర్‌ను సందర్శించిన ట్రైనీ కలెక్టర్

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి29: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామాన్ని గురువారం ట్రైనింగ్ కలెక్టర్ కిరణ్మాయి సందర్శించారు. వివిధ అంశాలపై క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాలపై అడిగితెలుసుకున్నారు. గ్రామపంచాయతీ ఆవరణలో ఐకెపీ, ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి చర్చించారు. పలు అంశాలపై వారిని అడిగితెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని పల్లెప్రకృతి వనం, నర్సరీని సందర్శించారు. నర్సరీలో ఏఏ రకాల మొక్కలు పెంచుతున్నారు, అనంతరం సీడ్ ప్రాసెసింగ్‌ను పరిశీలించి సీడ్ ప్రాసెసింగ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట డీఎల్‌పీవో శివకృష్ణ, ఎంపీడీవో సాయిరాం, రైతు సంఘం మాజీ కార్యదర్శి కెకె.బాజన్న, ఏపీవో సురేష్, పంచాయతీ కార్యదర్శి హారిక, గ్రామస్థులు ఉన్నారు.



అంకాపూర్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ కిరణ్మాయి

కాంగ్రెస్, బీఆర్ఎస్ స్నేహ పూర్వక రాజకీయాలు

● ఫ్యాక్టరీ రైతులను రెండు పార్టీలు మోసం చేశాయి ● ఫ్యాక్టరీ పునరుద్ధరణకు బీజేపీ కట్టుబడి ఉంది : ఎంపీ ధర్మపురి అర్వింద్

బోధన్ రూరల్, ఫిబ్రవరి 29: కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు స్నేహ పూర్వక రాజకీయాలు చేస్తున్నాయని, తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని విధాలుగా దోచుకు న్నాయని, అలాంటి పార్టీలకు ప్రజలకు తగిన బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆసియా ఖండానికే తలమానికంగా ఉన్న నిజాంషుగర్ ఫ్యాక్టరీని రెండు పార్టీలు కాలగర్భంలో కలిపాయని బీజేపీ ఫ్యాక్టరీ విషయంలో రాజీపడదని, పునరుద్ధరణకు బీజేపీ కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. బోధన్ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ గేట్ ఎదుట గురువారం చెరకు రైతులు, కార్మికులతో ఎంపీ ధర్మపురి అర్వింద్ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా కాంగ్రెస్ హయాంలో 66 ఫ్యాక్టరీలు మూతపడ్డాయని పేర్కొన్నారు. ఐదు సంవ త్సరాల కాలంలోనే ప్రధానమంత్రి మోదీ రూ.9 వేల కోట్ల కేటాయించి మూత బడిన ఫ్యాక్టరీలను పునరుద్ధరించారని పేర్కొన్నారు. పునరుద్ధర ణతో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ విషయంలో ఆరెండు పార్టీలు తీసుకున్న నిర్ణయాలు ఈ ప్రాంత రైతులకు శాపంగా పరిణమిచ్చాయని ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ కవిత ఇద్దరి మధ్య రాజకీయ స్నేహ బంధం ఉందని, ఇద్దరు చర్చించే ఎంపీ అభ్యర్థులను నిర్ణయిస్తారని ఆరోపించారు. నరేంద్రమోదీ దేశాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారని, వేల సంఖ్యలో ఇళ్లను, సంక్షేమ పథకాలను అమలు చేశారన్నారు. నిజాంషుగర్ ఫ్యాక్టరీ త్వరలోనే పునరుద్ధరించబడుతుందని, దానికి బీజేపీ కట్టుబడి ఉందని ఆయన అన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అర్వింద్

ఓటు వేయాలన్నారు. కేంద్రంలో మరోసారి మోదీ సర్కార్ అధికారంలోకి రాబోతుందని జోష్యం చెప్పారు. హ్యాట్రిక్ కొట్టి మూడోసారి ప్రధానిగా మోదీ ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీలు ఎప్పటికి ఒకటి కావని స్పష్టంచేశారు. కావాలనే కొందరు ఎన్నికల వేళ బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లె గంగారెడ్డి, యాత్ర సహ ప్రముఖ్ రావల రామ్‌నాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి మారోజు సుధాకర్‌చారి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, మండల అధ్యక్షులు బాలరాజు, మనోహర్, ఇంద్రకరణ్, రవి, ప్రవీణ్, అరవింద్, సందీప్‌లతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు సన్మార్గంలో నడవాలి : ఎమ్మెల్యే పోచారం



విగ్రహ ప్రతిష్ఠాపన వివరాలు తెలుసుకుంటున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూరు, ఫిబ్రవరి 29 : ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని, భక్తి మార్గాన్ని పెంపొందించుకుని ప్రతినిత్యం భగవంతున్ని పూజించాలని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలోని అంగడి బజార్‌లో నూతనంగా నిర్మించిన లక్ష్మీ గణ పతి ఆలయంలో గత మూడు రోజుల నుంచి ప్రతిష్ఠాపన మహోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. గురువారం నిర్వహించిన శ్రీ లక్ష్మీ గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకల్లో పోచారం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విధంగా ఆలయం వద్ద ధ్వజ స్తంభ, నంది విగ్రహాలను ప్రతిష్ఠించారు. హోమాలు, అభిషేకాలు, నిర్వహించి పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ధర్మాన్ని మనం కాపాడితే ధర్మం మనల్ని రక్షిస్తుందన్నారు. రాష్ట్రంలో శ్రీలక్ష్మీ గణపతి ఆలయాలు చాలా తక్కువ అరుదుగా ఉంటాయని, రుద్రూరులో లక్ష్మీ గణపతి ఆలయాన్ని నిర్మించడం ఎంతో శుభ సూచకమన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఆలయ నిర్మాణాలు చాలా గొప్పగా నిర్మాణం జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బద్దం సంజీవరెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పత్తి లక్ష్మణ్, మాజీ విండో చైర్మన్ పత్తి రాము, ఆలయ కమిటీ నిర్వాహకులు, సభ్యులు, మహిళలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాల రికవరీలో జిల్లాను ముందంజలో ఉంచాలి

● డీఆర్‌డీవో పీడీ సాయాగౌడ్



టీటీడీసీలో స్త్రీనిధి సమీక్షలో మాట్లాడుతున్న పీడీ సాయాగౌడ్

డిచ్‌పల్లి,ఫిబ్రవరి 29:మహిళా సంఘాల ప్రతినిధులు జిల్లాలోని సమాఖ్య సంఘాలను నిలుపుదల చేయకుండా తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లిస్తూ సంఘాల బలోపేతం కోసం చేయూత అందించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ సాయాగౌడ్ అన్నారు. గురువారం డిచ్‌పల్లిలోని జిల్లా సమాఖ్య టీటీడీసీ కేంద్రంలో జిల్లా స్థాయి స్త్రీనిధి కమిటీ సమావేశానికి పీడీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మహిళ సంఘాలకు 100శాతం రుణాలు పంపిణీ చేసి 100శాతం రికవరీ చేయాలని రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా స్త్రీనిధి రికవరీలో ముందువరుసలో ఉండాలన్నారు. డిచ్‌పల్లి, ఇందల్వాయి మండలాల వీవోఏలు మహిళ సంఘాలు లక్షాధికారులను చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణ లక్ష్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో స్త్రీనిధి ఆర్ఎం కిషోర్, డీపీఎం శ్రీనివాస్, నాగమణి, సాయిలు, గంగాధర్, రాజేందర్, రజిత, సువర్ణ, సీసీలు ఏపీఎంలు పాల్గొన్నారు.

'విద్య, వైద్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం'



పెర్కిట్‌లో కేజీబీవీలో విద్యార్థినిలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి29: విద్య, వైద్యం ఉపాధి రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లోని కస్తూర్బ బాలికల పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో సమస్యలను అడిగితెలుసుకున్నారు. తరగతి గదులను, హాస్టల్ గదులను ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రతీ విద్యార్థినికి పౌష్టికాహారం అందేలా చూడాలని పాఠశాల ప్రత్యేక అధికారిణి గంగామణికి సూచించారు. అనంతరం తరగతి గదుల్లోకి వెళ్ళి విద్యార్థినిలతో ముచ్చటించారు. పాఠశాలలో ఉన్న సౌకర్యాలు, ఎదరవుతున్న సమస్యలపై విద్యార్థులను అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతను ఇస్తూ అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు కలిగోట గంగాధర్, ఆకుల శ్రీనివాస్, మందుల బాలు, ఉదయ్, సుమన్, పొల్కం వేణు, తదితరులు ఉన్నారు.

● ఛత్రపతి శివాజీ విగ్రహ సుందీకరణ పనులకు శంకుస్థాపన

ఆర్మూర్ పట్టణంలోని శివాజీచౌక్, గోల్‌బంగ్లా వద్ద గల ఛత్రపతి శివాజీ మహరాజ్ విగ్రహ సుందీకరణ పనులకు ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

బోధన్‌రూరల్,ఫిబ్రవరి 29: బోధన్ పట్టణంలోని చావిడి వద్ద నూతన హనుమాన్ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు గురు వారం నుంచి ప్రారంభమయ్యాయి. నేటి నుంచి మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించబడుతాయని బోధన్ గ్రామ కమిటీ అధ్యక్షుడు బాగారెడ్డి తెలిపారు. మొదటి రోజు గ్రామా భివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో పలువురు దంపతులచే ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపనలో భాగంగా జగ ద్గురు శంకరాచార్య హంపీ విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి మహా సంస్థానం పీఠాధిపతి హాజరు కానున్నారన్నారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో గ్రామ కమిటీ సభ్యులు, వివిధ కుల సంఘాల నాయకులు తదిత రులు ఉన్నారు.

● మారుతి మందిరంలో నవగ్రహ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవం

బోధన్ పట్టణంలోని మారుతి మందిరంలో గురువారం నూతన



మారుతి మందిరంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం

మండపంలో నవగ్రహ యంత్ర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మశ్రీ వేద పండితులు నెట్టూరి వామన హవదాని, ప్రవీణ్ మహరాజ్ మంత్రోచ్ఛరణల మధ్య హోమం, యంత్ర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో వేద పండితులు మహేష్ జోషి కేదార్, దేవాదాయ కార్యనిర్వాహణ అధికారి రవీందర్ గుప్త, రాములు, విగ్రహాల దాతలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతు సంఘాల ధర్నా



ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘాల నాయకులు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి 29: రైతాంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రైతు సంఘాల సమాఖ్య ఇచ్చిన పిలుపు మేరకు గురువారం బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. జాతీయ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు సోమశేఖర్‌రావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగులో రైతులను ప్రోత్సాహించాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు అవసరమైన సబ్సిడీలు, భీమా పథకాలను, యంత్రాలను ప్రభుత్వం రైతులకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని కోరారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలన్నారు. మూతబడిన చక్కెర కర్మాగా రాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. రైతుల బకాయిలను ప్రభుత్వమే చెల్లించాలని, చెరకు రవాణాపై ఉన్న అంశాలను తొలగించాలని కోరారు. వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రైతు సహకార సంఘాలకు ఆదాయ పన్ను రాయితీ వర్తింపజేయాలని కోరారు. జాతీయ స్థాయిలో నిర్ధారిత సమయంలో పౌర సేవలు పొం దే హక్కు చట్టాన్ని తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపల్లి సహకార సంఘం అధ్యక్షులు డాక్టర్ సునీల్‌కుమార్, రైతులు గంగారాం, మోతిలాల్, షరీఫ్, గోవింద్, మాణిక్యం, సూర్యకాంత్ తదితరులు ఉన్నారు.

ఘనంగా అంకలమ్మ, పొలేరమ్మ ఆలయ వార్షికోత్సవం

నవీపేట,ఫిబ్రవరి29: మండలంలోని కమలాపూర్‌లో అంకలమ్మ, పొలేరమ్మ ఆలయ 4వ వార్షికోత్సవ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో మహాకుంభాభిషేకం



పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 29: నగర ప్రజలు సంతోషంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త అన్నారు. నగరంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహించిన మహాకుంభాభిషేకం పూజా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కోటగల్లిలోని భక్త మార్కండేయ సహిత శివపంచాయాతన నవగ్రహ దేవాలయ రాజగోపుర కలశ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తకు ఆలయ పూజారులు స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్పరాజు, ఎనగందుల మురళి, సత్యప్రకాష్, సూదం రవిచందర్, దండు శేఖర్, సాయి, ముచ్కూరు నవీన్ పాల్గొన్నారు.

భక్త మార్కండేయ ఆలయంలో పూజలు



పూజలు నిర్వహిస్తున్న హంపీ పీఠాధిపతి

ఖిల్లా, ఫిబ్రవరి 29: నగరంలోని కోటగల్లిలో ఉన్న శ్రీభక్తమార్కండేయ ఆలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో హంపీ పీఠాధిపతి విద్యారణ్య భారతిస్వామి పాల్గొన్నారు. విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఐదవ రోజు ధ్రుకుబలి, దిగ్‌బలి హరణము, నేత్రోనిర్మలనము, మహాపూర్ణాహతి, కుంబ సంప్రోక్షణ, శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి శాంతి కల్యాణం కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మంగిరాములు మహారాజ్, పురోహితులు చౌట్‌పల్లి గంగాప్రసాద్ దీక్షిత్, ఇప్పకాయల హరిదాస్ స్వామి, మాజీ విప్ ఈరవత్రి అనిల్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డితో పాటు పద్మశాలి సంఘం నేతలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రికి స్వాగతం పలికిన కలెక్టర్, సీపీ



కేంద్ర మంత్రి నితిన్ గడ్కారికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్, సీపీ

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 29:జిల్లా పర్యటనకు విచ్చేసిన కేంద్ర రోడ్డు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కారికి జిల్లాకు చెందిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ప్రత్యేక హెలిక్యాప్టర్ ద్వారా మంత్రి గురువారం మధ్యాహ్నం జిల్లా సమీకృత కలెక్టరేట్ హెలిప్యాడ్‌కు చేరుకోగా హెలిప్యాడ్ వద్ద నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అర్వింద్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, సీపీ కల్మేశ్వర్, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్,డీఎఫ్‌వో వికాస్ మీనా,ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్చాలు అందజేసి స్వాగతం పలికారు.అక్కడి నుంచి కేంద్ర మంత్రి భద్రతతో కాన్వాయ్ పాత కలెక్టరేట్ మైదానంలో జరిగే బహిరంగ సభకు వెళ్లారు.

ధర్పల్లిలో సైన్స్‌ఫేర్

ధర్పల్లి, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలోగల హంసవాహిని పాఠశాలలో గురువారం నిర్వహించిన సైన్స్‌ఫేర్ ఆకట్టుకుంది. తెలంగాణ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఈ విజ్ఞాన ప్రదర్శనలో విద్యార్థులు చేసిన సైన్స్‌కు సంబంధించి ప్రదర్శనలు తిలకించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఈ ప్రదర్శన ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చక్రవర్తి, మాన్‌సింగ్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

టీయూలో ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 29: తెలంగాణ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ క్రికెట్ టోర్నమెంట్ గురువారం 4వ రోజు హోరాహోరీగా జరిగింది. తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్, సౌత్ క్యాంపస్ తలపడగా 12 ఓవర్లలో 104 పరుగులు సాధించి వర్సిటీ పీజీ టీం విజయం సాధించింది. 2వ బ్యాచ్‌లో మొదటి సెమిఫైనల్ గిరిరాజ్ కళాశాల కేర్ డిగ్రీ కళాశాల తలపడగా 15ఓవర్లలో 145 పరుగులు సాధించి గిరిరాజ్ డిగ్రీ కళాశాల ఫైనల్స్‌కి చేరిందని స్పోర్ట్స్ డైరెక్టర్ బాలకిషన్ తెలిపారు. ఈటోర్నీలో ఆర్గనైజింగ్ సెక్రటరీ, సిబ్బంది,క్రీడాకారులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

ధర్పల్లి, ఫిబ్రవరి 29:మండలంలోని చల్లగరిగె శివారులో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట ఆడుతున్న వారిపై దాడి చేసి వారి వద్ద నుంచి రూ.3250 నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఐదుగురిపై కేసు నమోదు చేశామని చెప్పారు.



చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.215	రూ. 240
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.220	రూ. 250



బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.64,050	రూ.59,050	రూ.740

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఆపరేషన్ వాలెంటైన్ (11.00, 1.55, 4.50, 7.45, 10.40)
స్ర్కీన్-2 : దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (10.00)
: చారి 111 (1.30, 4.20, 10.10)
: భూతద్దం భాస్కర్ నారాయణ (7.10)
స్ర్కీన్-3 : భూతద్దం భాస్కర్ నారాయణ (12.10)
: దునే పార్ట్-2 (ఇంగ్లీష్) (3.10, 6.40, 10.10)
స్ర్కీన్-4 : ఇంటి నెంబర్-13 (1.05)
: కిక్ (3.50)
: ఆర్టికల్ 370 (హిందీ) (7.15)
: భూతద్దం భాస్కర్ నారాయణ (10.40)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్ర్కీన్-1 : ఊరుపేరు భైరవకోన (1.30)
: ఆపరేషన్ వాలెంటైన్ (7.30,10.30)
స్ర్కీన్-2 : చారి 111 (11.00, 1.40, 7.40)
: ఆపరేషన్ వాలెంటైన్ (4.30)
: కిక్ (10.30)
స్ర్కీన్-3 : మా ఊరి రాజారెడ్డి (10.30)
: ఆపరేషన్ వాలెంటైన్ (1.30)
: భూతద్దం భాస్కర్ నారాయణ (4.20, 10.20)
: ఊరుపేరు భైరవకోన (7.20)

దేవి : ఆపరేషన్ వాలెంటైన్ (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహల్ : కిక్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : ఇంటి నెంబర్-13 (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : ఊరుపేరు భైరవకోన (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్